# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-3 16, అక్టోబరు, 2014

తెలంగాణ రాష్ట్రంలో ప్రజా రవాణా వ్యవస్థను పటిష్ట పరచేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. మారుమూల పల్లె వాసుల నుండి పట్నం వాసుల వరకు అందరికి రవాణా అవసరాలను తీరుస్తున్న తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసి ని ఆధునీకరించడానికి, అభివృద్ధి పరచడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. కొత్తగా ఆర్‌టిసి 1000 బస్సులు సమకూర్చాలని నిర్ణయించారు. ముఖ్యమంత్రి అధికార నివాసంలో రవాణా వ్యవస్థపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పి.మహేందర్ రెడ్డి, రవాణా శాఖ కమీషనర్ జగదీశ్, రవాణా శాఖ కార్యదర్శి అజయ్ మిశ్రా, ఆర్‌టిసి ఎండి పూర్ణచందర్ రావు, జెఎండి రమణారావు, ఎంపిలు బి.వినోద్ కుమార్, బూర నర్సయ్య గౌడ్, డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునిత, పైల శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

దసరా పండుగకు ముందు ఆర్‌టిసికి ప్రభుత్వం రూ. 250 కోట్లను అందించింది. గురువారం నాటి సమావేశంలో రూ.150 కోట్లను ఆర్‌టిసికి కొత్త బస్సులు కొనుగోలు కోసం ఇవ్వాలని సిఎం నిర్ణయించారు. దీంతో మొత్తంగా రూ. 400 కోట్లు ఆర్‌టిసికి ఇస్తున్నట్లు అయింది. ఇప్పటికే 350 కొత్త బస్సులను కొనుగోలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం గురువారం జరిగిన సమావేశంలో మరో 650 బస్సులను కొత్తగా సమకూర్చాలని నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో నడిపేందుకు 400 బస్సులు, 100 ఎక్స్‌ప్రెస్ బస్సులు, 50 ఇంద్ర, గరూడ తరహా వోల్వో బస్సులు కొనుగోలు చేయాలని, వీటితో పాటు ఆర్‌టిసికి ప్రైవేట్ బస్సులను సమకూర్చుకునే పరిమితి 25 శాతం ఉందని, దాని ప్రకారం మరో 100 ప్రైవేటు బస్సులను అనుమతిస్తామన్నారు. మొత్తంగా 1000 కొత్త బస్సులు రెండు మూడు నెలల్లో రోడ్లపై తిరుగుతాయని చెప్పారు. అందమైన, ఆకర్షణీయమైన రంగుల్లో ఈ బస్సులు అన్ని ప్రాంతాల్లో కళియతిరుగుతూ కొత్త శోభ తెస్తాయన్నారు. మార్చి

తరువాత మరో 1000 బస్సులు కూడా కొంటామని వెల్లడించారు. తెలంగాణ ఆర్టిసిలో 2000 బస్సులు రీప్లేస్మెంట్ జరుగుతుందన్నారు. ఆర్టిసి కోసం నడిచే అద్దె బస్సులకు వ్యాట్ మినహాయింపు ఇవ్వాలనే ప్రతిపాదన పట్ల కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. తాత్కాలిక పద్ధతిన పనిచేస్తున్న డ్రైవర్, కండక్టర్లకు తగు శిక్షణనిచ్చి పర్మనెంట్ చేసే విషయంలో కూడా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్ నగరంలో 4000 ఆర్టిసి బస్సులు నడుస్తున్నందన ఇక్కడ నిర్వహణ సామార్థ్యం పెంచేందుకు ఒక ఎక్జిక్యూటివ్ డైరెక్టర్, రెండు రీజినల్ మేనేజర్ల పోస్టులను కూడా ముఖ్యమంత్రి మంజూరు చేశారు. ఆర్టిసిని లాభాల బాట పట్టించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం చెప్పారు. డిపోల వారిగా పరిస్థితిని అధ్యయనం చేసి ఆయా డిపో మేనేజర్లు ఆర్టిసి ఎండికి నివేదిక సమర్పించాలన్నారు. దాని ప్రకారం రవాణా శాఖ మంత్రి ఆధ్వర్యంలో రవాణా శాఖ కమీషనర్, డిటిసిలు, ఇతర ముఖ్య అధికారులు మరోసారి సమావేశమై ఆర్టిసి బలోపేతానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించాలన్నారు. మూడవ దశలో తానే స్వయంగా ఆర్టిసి అధికారులందరితో సమావేశం అవుతానని సిఎం చెప్పారు. ఆర్టిసి ఎండి, ఇడిలు, ఆర్ఎంలు, డివిజినల్ మేనేజర్లు, డిపో మెనేజర్లు, డిటిసిలు, జాయింట్ కమీషనర్లు, ఆర్టిఓలు, ఎంవిఐలు, అసిస్టెంట్ ఎంవిఐలతో తాను నేరుగా మాట్లాడి ఆర్టిసిని లాభాల దారిలోకి తెచ్చేందుకు చర్చిస్తానన్నారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు కట్టు దిట్టమైన చర్యలు తీసుకుంటామని కూడా వెల్లడించారు. 0.08 అక్సిడెంట్ రేషియోతో అఖిల భారత స్థాయి రికార్డు నెలకొల్పిన ఆర్టిసిలో ప్రమాదాల శాతాన్ని మరింత తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతిరోజు 10,000 బస్సులు 90 లక్షల మందికి ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ, 63.5 వేల మంది ఉద్యోగులను కలిగియుండి దేశంలోనే నెంబర్ 1 రోడ్డు రవాణా సంస్థగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిలుస్తుందని చెప్పారు. దీన్ని మరింత బలోపేతం చేసి, సంస్థాగత సామర్ధ్యం పెంచి గొప్ప ప్రజా రవాణా వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం అని సిఎం వివరించారు. ఆర్టిసిలో ప్రస్తుతం 72 శాతం అక్యుపెన్సి రేషియో ఉందని, దీన్ని మరింత పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. బస్టాండ్లలో పరిశుభ్రత పాటించాలని, టాయిలెట్లను పరిశుభ్రంగా, ఆరోగ్యకర వాతావరణంలో ఉంచాలని చెప్పారు. డిపోలు,

బస్‌స్టాండ్లలో విరివిగా చెట్లు పెంచాలని సూచించారు. కొత్త రంగులు, కొత్త హంగులు, కొత్త లోగోతో ఆర్‌టిసిని ప్రగతి పథంలో పయనింపజేయాలని సిఎం సూచించారు. రోడ్ సేఫ్టీలో, ఇందన పొదుపులో దేశంలోనే అగ్రస్థానంలో ఉన్న తెలంగాణ ఆర్‌టిసి ఎక్కువ బస్సుల సముదాయాలు కలిగిన 3వ అతిపెద్ద రవాణా సంస్థగా నిలుస్తుందన్నారు. అంకిత భావం కలిగిన ఉద్యోగులందరిని భాగస్వాములను చేసి తెలంగాణ ఆర్‌టిసిని పటిష్ట పరుస్తామని వెల్లడించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం